క్లుప్తంగా

సామాజిక-ఆర్థిక ప్రణాళికలో గణాంకాల పాత్ర కీలకం



ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'నేషనల్ స్టాటిస్టిక్స్ డే' నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఉన్నత భారత అభియాన్ ఆధ్వర్యంలో 'నేషనల్ స్టాటిస్టిక్స్ డే' కార్యక్రమం నిర్వహించామని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ సామాజిక-ఆర్థిక ప్రణాళిక, విధాన రూప కల్పనలో గణాంకాల పాత్ర గురించి యువతలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, కళాశాల స్టాటిస్టిక్స్ అధ్యాపకులు ఏ.శ్రావణి సంధ్య, కళాశాల ఏఓ బోనం సురేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్స్ డే

ఉండి: జాతీయ డాక్టర్స్ డే పురస్కరించుకొని జూలై 1 ఉదయం 8 గంటలకు ఉండి రాజులపేటలోని కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కాగిత శ్రీనుబాబు, డాక్టర్ ఎం.సుబ్బలక్ష్మిని క్లబ్ తరఫున ఘనంగా సత్కరిస్తున్నట్లు వారు తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకం

ఉండి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి అన్నారు. ఆదివారం చెరుకువాడ జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం గాదిరాజు వెంకట సత్యనారాయణరాజు పదవీ విరమణ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సమాజంలో జ్ఞానాన్ని బోధించి మనిషిని మహనీయుడిగా మార్చగలిగే అవకాశం ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే ఉందన్నారు.అందుకే పూర్వీకులు గురువులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఖ్యాతిని గడించారని తెలిపారు. సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, డీవైఈవో శ్రీరామ్, మాజీ డీఈవో వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏవీఐఎస్ ఆసుపత్రి సహకారంతో వెరికోస్ వెయిన్స్, దీర్ఘకాలిక మోకాలు, మరియు కీళ్ళ నొప్పులకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రజని కన్సల్టెంట్ వారి పర్యవేక్షణలో 150మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వెరికోస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, పూర్వాధ్యక్షుడు వబిలిశెట్టి నటరాజ్, మానేపల్లి రామారావు, అధ్యక్షుడు కొల్లేపర రాము, కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు, కోశాధికారి భోగవల్లి రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి



వాకర్స్ నెలవారీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యవంతమైన సమాజంకోసం కృషిచేద్దామని పలువురు వాకర్స్ పేర్కొన్నారు. వాకర్స్ నెల వారీ సమావేశం ఆదివారం అధ్యక్షులు దూలం నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితానికి నడక ఎంతో అవసరమని, యోగా తప్పనిసరిగా చేయాలని, సీజినల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో యోగా గురువు బడుగు చంద్రశేఖర్, కార్యదర్శి చిప్పాడ గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారథి, కేవీ చలం, రాగిరెడ్డి ప్రసాద్, వనచర్ల నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రావిపాడులో అన్నసమారాధన

పెంటపాడు: రావిపాడు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణ ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు 5 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చింతపల్లి, దువ్వ, అలంపురం, కొండేపాడు, గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భూసారమే పంటకు మేలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్‌ఫోటో)

ఉండి: వ్యవసాయం రైతుకు నష్టాన్నే మిగులుస్తుందనేది రైతుల ఆవేదన. అయితే నష్టాల నుంచి రైతు లాభాల బాట పట్టాలంటే వ్యవసాయంలో సరైన చర్యలు చేపట్టాల్సిందే. దీనిలో ముఖ్యమైన పని భూసార పరీక్ష. ప్రతీ రైతు తప్పనిసరిగా తాను పండించే పొలంలో మట్టిని పరీక్ష చేయించాలి. అప్పుడే సంబంధిత పంట సంరక్షణకు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు అందించి మెరుగైన దిగుబడులు వచ్చేందుకు అనువుగా ఉంటుంది. పెట్టుబడులు తగ్గి దిగుబులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. సాగుభూమిలో భూసార పరీక్షలు చేయడం వల్ల నేలలోని పోషకాలు, లోపాలు, ఆమ్ల, క్షార, చౌడువంటి ఇతర లక్షణాలు, సమస్యలు తెలుస్తాయి. దీనివలన ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలియడంతో అనవసర ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి పంట వ్యయం కూడా తగ్గుతుంది. భూమిలో ఉండే పోషకాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు దోహదపడతాయి. అధిక దిగుబగులు సాధించే క్రమంలో కొందరు రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వాడటంతో భూమిలో సహజంగా లభించే ఖనిజాలు నశిస్తాయి. దీంతో నత్రజని తగ్గి భూమి తన ఉత్పాదక శక్తిని కోల్పోతుంది. ఇదే సమయంలో భూమి సారం కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు వస్తాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలంటే భూసార పరీక్ష మంచి మార్గమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పరీక్ష వల్ల పోషకాలు లెక్క పక్కా

పంట పొలంలో సేకరించిన మట్టిని పరీక్ష చేయించిన అనంతరం నేల స్వభావం, లక్షణాలు తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాలు, సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, నేలల్లో పోషకాల స్థాయి పరీక్షించి వాటి ఫలితాల ఆధారంగా పంటకు వేయాల్సిన ఎరువుల మోతాదు సూచిస్తారు. దీని వలన సాగు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగి రైతులు లాభాలను సాధిస్తారు.

భూసార పరీక్ష చేయించాలిలా

పొలంలో త్రిభుజాకారంలో 15-20 సెం.మీ. వరకు పారతో గుంట తీసి అందులో పై పొర నుంచి క్రింది వరకు ఒక పక్కగా మట్టి తీయాలి. ఎకరా విస్తీర్ణంలో ఈ విధంగా 8-10 చోట్ల మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిలో రాళ్లు, వేర్లు లేకుండా చూడాలి. అలాగే కంపోస్టు, పచ్చిరొట్ట తదితర ఎరువులు ఉన్న చోట్ల మట్టిని సేకరించకూడదు. ఎప్పుడూ నీరు నిలబడి ఉండే ప్రాంతంలో మట్టిని సేకరించకూడదు.

తప్పనిసరిగా చేయించాలి



భూసార పరీక్ష పంట ఆరోగ్యానికి, అధిక దిగుబడులకు, లాభదాయక వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతీ రైతు తన పొలంలో మట్టిని కనీసం రెండు లేదా మూడేళ్లకు ఒకసారి పరీక్ష చేయించాలి. దీని వలన రైతుకు, చేనుకు, పర్యావరణానికి ఎంతో మేలు జరగడమే కాకుండా వృధా ఖర్చులు తగ్గి రైతు లాభాల బాట పడతాడు. సాంప్రదాయ వ్యవసాయానికి రైతులు స్వస్తి చెప్పి అధికారుల సూచలను పాటించాలి.

– బీ.సంధ్య, మండల వ్యవసాయాధికారి

ఘనంగా ఆషాఢమాస జాతర



జాతరలో సమర్పించిన నైవేద్యం

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీ మావుళ్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు స్వాములకు ఆదివారం ఆషాఢ మాస జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగలను పూరి గుడిసెలోకి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు పుట్టింటివారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, సర్పంచ్ గెద్దం భారతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, మాజీ సర్పంచ్ కొరు భాస్కరరావు, తోట విజయ్‌కుమార్, ఎం దుర్గాప్రసాద్, కొరు రామగోపి, శీలబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

వేద పాఠశాలలో దరఖాస్తు గడువు జూలై 5

ఆకివీడు: మండలంలోని అయిభీమవరంలో శ్రీవేంకటేశ్వర వేద విద్యాలయంలో వేదం నేర్చుకునేందుకు జూలై 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వారణాసి సుబ్రహ్మణ్యం ఆదివారం చెప్పారు. గతంలో వేదం నేర్చుకొని మానేసిన వారు, కొత్తగా వేదం నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న బ్రాహ్మణ వేద విద్యార్థులకు సువర్ణావకాశమని ఆయన అన్నారు. వేద పాఠశాలలో చతుర్వేదాలను బోధిస్తారని తెలిపారు. వేదం నేర్చుకునే బాలురు అక్షర పరిజ్ఞానంతోపాటు 9 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

4న అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సభ



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం (ప్రకాశంచౌక్): మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా శత వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం భీమవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బి.బలరాం తెలిపారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణ కమిటీ సమావేశం ట్రస్టు కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ భీమవరంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి అల్లూరి స్వ గ్రామం మోగల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, నరసాపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ భీమవరంలో జరిగే ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని బలరాం కోరారు. నిర్వహణ కమిటీ సభ్యులు కె.రాజా రామ్మోహన్ రాయ్, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కె.క్రాంతి బాబు, బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, బత్తుల విజయ్ కుమార్, ఎస్.రంగ, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక.. ప్రజా పాలనకు దీపం



మాట్లాడుతున్న సామాజికవేత్త వర్మ

తణుకు: రాజ్యాంగంపై మతతత్వవాదుల దాడులను తిప్పి కొట్టడంతో పాటు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ సామాజిక వేత్త, దారి దీపం సంపాదకుడు డీవీవీఎస్ వర్మ పేర్కొన్నారు. తణుకు సురాజ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన దారి దీపం మాసపత్రిక మిత్రుల సమాలోచన సభలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో రాజ్యాంగ పీఠిక-ప్రజా పాలనకు దారి దీపం అనే అంశంపై వక్తలు మాట్లాడారు. ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణులు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన రాజ్యాంగ పీఠిక గ్రంథాన్ని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకురాలు సంకు మనోరమ ఆవిష్కరించారు. అనంతరం బహుళ సంస్కృతిపై హిందుత్వ దాడి-ప్రత్యామ్నాయాలు అనే అంశంపై నిర్వహించిన రెండో సదస్సులో ప్రముఖ జర్నలిస్టు మందలపర్తి కిశోర్, కె.శాంతారావు, డాక్టర్ సి.స్టాలిన్, మాజీ న్యాయమూర్తి లక్ష్మి, సామాజిక ఉద్యమకారులు హైమావతి, వావిలాల సరళాదేవి మాట్లాడారు.

రహదారిపైనే మురుగు నీరు



దళితవాడలో రహదారిపై నిలిచిన మురుగు నీరు

పాలకోడేరు: అది మేజర్ పంచాయతీ మోగల్లు గ్రామం లోని దళిత వాడ, మూడు రోడ్ల కూడలిలో రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షం వచ్చినా రాకపోయినా ఈ రోడ్డుపై మురుగు నీరు ఎప్పుడూ నిలిచే ఉంటుంది. సుమారు 500 కుటుంబాలు నిత్యం ఈ రహదారిపై నీటిలోంచే నడక సాగిస్తున్నారు. కింద భాగంలో డ్రైనేజీ పూడుకుపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులు గానీ, సర్పంచ్ గానీ, వార్డ్ మెంబర్లు గానీ పట్టించుకోవడం లేదు. పంచాయతీ సెక్రటరీ గ్రామం లో నివాసం ఉండకుండా వేరే గ్రామం నుంచి రావడం వల్ల గ్రామ సమస్యల పట్ల అవగాహన లేదు. దీంతో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేని ఇష్టా రాజ్యంగా మారింది గ్రామం పరిస్థితి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేయకపోతే పలువురు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిరసన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

కళాకారుల సంఘ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సూరంపూడి వెంకట రమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 145వ నెలవారి సభా కార్యక్రమం ఆదివారం రాత్రి ఆర్టీసీ డిపో సమీపంలోని వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణలు పర్యవేక్షించారు. పెదవెల్లమిల్లికి చెందిన వాస్తు పండితులు దండమూడి సత్యనారాయణకు గౌరవ సత్కారం, భీమవరానికి చెందిన సాయి ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వాహకులు తమిరి సాంబమూర్తికి కళా సత్కారం, కొమ్ముగూడెం వ్యాయమ ఉపాధ్యాయులు కొత్త సుభద్రకు ఉద్యోగ సేవా పురస్కారం, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ భజన కళాకారుడు ఇసరపు అబ్బులుకు ఆర్థిక సత్కారం చేశారు. కళాకారుల ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి నిర్వహించారు.

ఘనంగా మానవత సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర నలుమూల ప్రాంతాలలో అనేక సేవలందిస్తున్న ఏకైక సంస్థ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అని సంస్థ జిల్లా అధ్యక్షు లు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్లో మానవత సంస్థ 2024-25 సంవత్సరానికి గానూ పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం పత్స వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జానకిరామ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ మానవత సభ్యులు 65 వేల మంది ఉన్నారని, వారు సైనికుల మాదిరి అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, ముప్పిడి సురేష్ రెడ్డి, రామలక్ష్మి, బలుసు సత్యనారాయణ, బత్తుల ప్రసాద్, మాకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం

డీఎఫ్ఓ హిమ శైలజ వెల్లడి



డ్రెయిన్లను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ హిమ శైలజ, రేంజర్ రామలింగాచార్యులు

ఆకివీడు: కొల్లేరులో ఐదవ కాంటూర్ దిగువ ప్రాంతంలోని డ్రెయిన్ల తవ్వకం పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఉమ్మడి జిల్లా డీఎఫ్ఓ హిమ శైలజ చెప్పారు. మండలంలోని సిద్దాపురం గ్రామ శివారు ప్రాంతంలోని ఐదవ కాంటూర్ దిగువ ప్రాంతాల్లోని డ్రెయిన్లను ఆదివారం ఆమె పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కాంటూర్ పరిధిలోని బీదర సేడు, పాత వయ్యేరు, అవిశా కాలువ, పాత ఏరు, తదితర డ్రెయిన్లు పూడుకుపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి మురుగు నీరు, వర్షపు నీరు ఉప్పుటేరులోకి ప్రవహించట్లేదని చేసిన ఫిర్యాదు మేరకు ఆయా డ్రెయిన్లను పరిశీలించినట్లు ఆమె వివరించారు. గత కొన్నేళ్లుగా ఆయా డ్రెయిన్లు తవ్వకపోవడంతో నీటి ప్రవాహం మందగించి, ఎగువ ప్రాంతం నుంచి మురుగు నీరు చొచ్చుకొచ్చి దిగువనున్న పంట పొలాలను ముంచుతున్నాయని, ఎగువ ప్రాంతంలోని పంట పొలాలు కూడా ముంపునకు గురవుతున్నాయని రైతులు డీఎఫ్ఓకు వివరించారు. దీనిపై సమగ్ర నివేదికను రాష్ట్ర అధికారులకు పంపుతానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు తమ సమస్యల్ని వివరించారు. అటవీశాఖ కైకలూరు పరిధి రేంజర్ రామలింగాచార్యులు, ఎఫ్‌డీఓ రత్నరాజు, ఎఫ్ఎస్ఓ ఖరీమ్, జీ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



ఎల్.అగ్రహారంలో నిరుపేదలకు నిత్యావసరాలను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలోని వల్లీ మోహన్ యువజన సేవా సమితి కార్యాలయంలో పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు పటాన్ వలీ మాట్లాడుతూ ఆదరణ కొరవడిన వృద్ధులు, అనాథలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కాలుష్య కోరల్లో వీవీ కెనాల్

ఎగువకు డ్రెయిన్, దిగువకు పంట కాలువ



వెంకయ్య వయ్యేరు పంట కాలువ మొలాసిస్ నీటితో కలుషితమైన దృశ్యం

ఆకివీడు: వీవీ కెనాల్‌గా పేరొందిన వెంకయ్య వయ్యేరు పంట కాలువ కలుషితమయ్యింది. పంట కాలువలోకి ఎగువ ప్రాంతంలోని ఫ్యాక్టరీలు మొలాసిస్ నీటిని వదిలేయడంతో సాగునీరు పూర్తిగా కలుషితమవుతుంది. మూడు రోజులుగా ఇదే నీరు కాలువలో ప్రవహిస్తుంది. పరిమళ్ల లాకుల నుంచి దిగువ ప్రాంతానికి సాగు, తాగు నీరునందిస్తుంది. వెంకయ్య వయ్యేరు పంట కాల్వ ఎగువ ప్రాంత రైతులకు డ్రెయిన్‌గా ఉంది. వివిధ ఫ్యాక్టరీల డ్రెయిన్ నీరు, చేపల, రొయ్యల చెరువుల్లోని కలుషిత నీరు, ఎగువ ప్రాంతం నుంచి భారీ వర్షాలకు మురుగు నీరు కొట్టుకొచ్చి వెంకయ్య వయ్యేరు పంట కాలువలోకి చేరుతోంది. పరిమళ్ల లాకుల వద్ద నుంచి సుమారు 60 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరందిస్తుంది. సుమారు రెండు లక్షల మంది జనాభా ఈ నీటిని తాగుతున్నారు. వేసవి కాలంలోనూ, పంట కాలువలకు నీరు వదిలే సమయంలో ఎగువ ప్రాంతంలోని అట్టల ఫ్యాక్టరీ నుంచి, ఇతర ఫ్యాక్టరీల నుంచి కలుషిత నీరు పంట కాలువలలోకి వదిలేస్తున్నారు.

కాలువలకు తగ్గిన నీటి సరఫరా

ఉండి పంట కాలువలకు నీరు వదిలిన తరువాత వెంకయ్య వయ్యేరు కాలువకు అంతంతమాత్రంగానే వదిలారు. సుమారు 6 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన వెంకయ్య వయ్యేరు పంట కాల్వకు కేవలం 200 క్యూసెక్కులు, 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. ఈ వేసవిలో కాలువల్ని కట్టేసినా వివిధ చేపలు, రొయ్యల చెరువుల నుంచి వ్యర్థ నీటిని కాలువలోకి వదిలేశారు. దీంతో కాలువ పూర్తిగా ఎండకపోవడంతో గుర్రపు డెక్క, కర్రనాచు పేరుకుపోయాయి.

సెలనిటీతో కాలువ నీరు

వెంకయ్య వయ్యేరు పంట కాలువలోకి రొయ్యల చెరువులలోని సెలనిటీ నీటిని వదిలేయడంతో కాలువలో సెలనిటీ శాతం పెరిగిపోయింది. ప్రస్తుతం కాలువలో 3, 4 శాతం ఉప్పు సాంద్రత ఉంది. ఈ నీటిని తాగడంతో అనేక రోగాలు వస్తాయని గతంలోనే నీటి పరీక్షల ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థలు తేల్చి చెప్పాయి. కలుషితమవుతోన్న పంట కాలువను రక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు అటువైపే చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది డ్రెయినని, పంట కాల్వ కాదని, మేమేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువను ప్రక్షాళన చేసి, ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.